## క్లుప్తంగా

### పూర్వ విద్యార్థుల విరాళం


చెక్కు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

**కడప ఎడ్యుకేషన్:** కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు దాతృత్వం చాటుకున్నారు. తాము చదువుకున్న కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ఎస్.మేరీజోస్పినమ్మ రూ.1లక్ష, డి.వెంకటలక్ష్మి రూ.25వేలు, వి.శ్రీకుమారి రూ.25 వేల చొప్పున మొత్తం రూ.1,50,000 చెక్కు రూపంలో బుధవారం ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీంబాషాకు అందచేశారు. విరాళం ఇచ్చిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది అభినందించారు.

### పేదలకు అన్నదానం

**కడప ఎడ్యుకేషన్:** బీసీవైపీ జాతీయ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ జన్మదినం బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు రామచంద్ర యాదవ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక సేవలో భాగంగా కడప రిమ్స్ హాస్పిటల్ వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగార్జున, కిశోర్, సుబ్బారావు, నాగమల్లయ్య, మల్లికార్జున, పాలకొండయ్య, సంజీవ్, పుల్లయ్య, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

### నిబంధనలు పాటించని సంస్థలపై చర్యలు తీసుకోవాలి


ఆర్‌జేడీకి వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

**కడప ఎడ్యుకేషన్:** రాయలసీమ వ్యాప్తంగా ప్రభుత్వ నిబంధనలను పాటించని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు కత్తి, టీఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాజ్, ఎన్‌డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశారు. కడప పాఠశాల విద్య ఆర్‌జేడీ శ్యాముల్‌ను బుధవారం కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ వ్యాప్తంగా కేశవరెడ్డి, భాష్యం చైతన్య, నారాయణ స్కూల్స్ ఎలాంటి నిబంధనలు పాటించకుండా పుస్తకాలు విక్రయిస్తూ యూనిఫాం, అడ్మిషన్ ఫీజు అంటూ తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. డొనేషన్ పేరుతో రూ.10 వేలు రాబడుతూ ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారన్నారు. కరికులం పేరుతో ఫీజుల దోపిడీ చేయడం జరుగుతోందని ఆరోపించారు. విద్యార్థుల నడ్డి విరుస్తున్నా.. పట్టించుకోకపోవడం బాధాకరమైన విషయం అన్నారు, కర్నూల్, కడప, తిరుపతి, అనంతపురం జిల్లాలలో హాస్టళ్లపై నిఘా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో బయన్న, ప్రవీణ్, కన్నా, నాయుడు, చంద్ర, సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు

### సైబర్ భద్రతపై అవగాహన


మాట్లాడుతున్న నాగలింగారెడ్డి

**కడప ఎడ్యుకేషన్:** నేటి డిజిటల్ యుగంలో బ్యాంకు ఖాతాదారులకు సైబర్ భద్రత అవగాహన ఉండాలని డిగ్రీ కళాశాలల రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ డాక్టర్ నాగలింగారెడ్డి పేర్కొన్నారు. కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులకు సైబర్ భద్రత, ఏఐపై ఒక్కరోజు వర్క్‌షాప్ బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ సలీంబాషా మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో సైతం ఉద్యోగులు ఏఐ టూల్స్ సరైన విధంగా వినియోగించాలంటే వర్క్‌షాపు ఎంతో అవసరం అన్నారు. హైదరాబాద్ జోజిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ సంధ్యా రాణి, రాజంపేట అన్నమాచార్య పీజీ కాలేజ్ ఆఫ్ కంప్యూటర్ స్టడీస్ ప్రిన్సిపల్ సమతానాయుడు విద్యార్థులకు డీప్ టెక్, సైబర్ సెక్యూరిటీ, పండమెంటల్స్, డిజిటల్ ప్రాక్టీసెస్, ఫిషింగ్ మోసాలు, డేటా ప్రొడక్షన్, సురక్షిత బ్రౌజింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్సు విభాగం ఇన్‌చార్జి హరిత, ఐక్యూసీ కో ఆర్డినేటర్ కృష్ణవేణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

**వల్లూరు :** మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని వల్లూరు గ్రామ సమాఖ్య–3లోని ఏ ఓబాయపల్లెలో లక్ష్మీనరసింహస్వామి గ్రూపుకు చెందిన సభ్యురాలు దాసరి కేశమ్మ ఉన్నతి పీఎం ఏజేఏవై పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన ముగ్గు పిండి, రంగోలి కలర్స్), కిరాణా షాప్‌లను బుధవారం పీడీ సందర్శించారు. కార్యక్రమంలో ఏపీఎం యామినీ పూర్ణిమ, లబ్ధిదారులు, సంఘ సభ్యులు, సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

## ● పాత రిమ్స్‌లో దుర్గంధం

ఏళ్లపాటు రోగుల సేవలందించిన కడప నగర నడిబొడ్డున ఉన్న పాత రిమ్స్ చెత్తతో నిండిపోతోంది. ఈ ఆవరణలో పలు శాఖల కార్యాలయాలు ఉండడంతో ప్రజలు, అధికారులు చెత్త, దుర్గంధం భరిస్తూ వెళ్లాల్సి వస్తోంది. ఏసీబీ కార్యాలయం సమీపంలో చెత్త పేరుకుపోయి మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి సాక్ష్యంగా నిలిచాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప



## వరిలో కాలిబాటలు తీసుకోవాలి

**సిద్దవటం :** వరి నారు నాటేటప్పుడు కాలిబాటలు తప్పనిసరిగా తీసుకోవాలని, కాలిబాటలు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి రైతులకు వివరించామని బద్వేల్ ఏడీఏ నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలంలోని జ్యోతి గొల్లపల్లె గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వ్యవసాయ అధికారులు వరి నారుమడిని పరిశీలించారు. ఈ సందర్భంగా బద్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజ మాట్లాడుతూ ఈ గ్రామంలో వరి ప్రధాన పంట 15 రోజుల్లో వరి నాట్లు ప్రారంభమవుతాయన్నారు. జీవన ఎరువుల ప్రాధాన్యత, వాడకం, భాస్వరం కరిగించే బ్యాక్టీరియా, సుడోమోనస్ ఫ్లోరిసెన్స్ అనే తెగుళ్ల నియంత్రణ మందులు వాడే విధానం గురించి రైతులకు తెలియజేశామన్నారు. డ్రోన్ టెక్నాలజీ వినియోగం సబ్సిడీపై పంపిణీ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. వరిలో గట్లను వెడల్పుగా ఉంచుకోవడం, నాట్లు నాటేటప్పుడు కొనలు తుంచి నాటాలన్నారు. వరినారు తీసేవారు మందు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు సరిపడా నారుమడిలో 480 గ్రాములు వేసుకోవాలన్నారు. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. ఉల్లికోడు, కాండం తొలుచు పురుగు, దోమ పోటు, అగ్గి తెగులు, వంటి చీడపీడల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం సహాయకులు, రైతులు పాల్గొన్నారు.


నారుమడిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

## యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి

**కడప అగ్రికల్చర్:** రాష్ట్ర ప్రభుత్వం అందజేసే యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, జేసీ అదితి సింగ్ సూచించారు. కడప కలెక్టరేట్‌లో రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద ప్రభుత్వం 2024–25 సంవత్సరానికి ఐదెకరాల లోపు, చిన్న, సన్నకారు రైతులకు పరికరాలు అందిస్తోందన్నారు. 50 శాతం రాయితీపై 83 రొటోవేటర్లు, 283 స్ప్రేయర్లు, 515 ట్రాక్టర్ పరికరాలు, 11 పవర్ టిల్లర్లు, పవర్ వీడర్, బుష్‌కట్టర్లు రూ.2.04 కోట్లతో రాయితీపై అందించిందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, రైతులు, పాల్గొన్నారు.


మెగా చెక్కు అందజేస్తున్న జేసీ, ఎమ్మెల్యే

## ప్రజలను దగా చేసిన కూటమి ప్రభుత్వం

**చింతకొమ్మదిన్నె :** కూటమి ప్రభుత్వం ఏడాది పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మండల కన్వీనర్ గూడా ప్రభాకరరెడ్డి, కమలాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కడప నగర డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డిలు తెలిపారు. బుధవారం వారు మండల నాయకులతో కలసి జగనన్న అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఆడబిడ్డ నిధి పేరిట 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఆ పథకాన్ని పీ4కు అనుసంధానం చేశామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అలాగే రైతులకు అండగా నిలిచిన ఆర్బీకేలను నిర్వీర్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం కేవలం మాటలతోనే కాలం గడుపుతోందని, అధికారమంతా అమరావతికే అన్నట్లుగా మిగిలిన ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్రారెడ్డి, ప్రసాదరెడ్డి, గంగాధరరెడ్డి, లక్ష్మీనారాయణ, వెంకటరెడ్డి, నాగరాజు, చిన్నసుబ్బరాయుడు, సదానంద, కువైట్ బాషా, మహిళా నాయకురాలు కే.జ్యోతి, యువజన నాయకులు ఈశ్వర్‌రెడ్డి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

## మోసం చేయడం చంద్రబాబు నైజం

**కమలాపురం :** ప్రజలను మోసం చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నైజం అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధా ఉత్తమారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో మండలస్థాయి సమావేశం నిర్వహించారు. జగనన్న అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం దృశ్యమాలిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో హామీలివ్వడం, అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. 2014, 2024లో అనేక హామీలిచ్చి గద్దెనెక్కిన చంద్రబాబు అధికారంలోకి రాగానే వాటిని విస్మరించారని గుర్తు చేశారు. 2024లో చెప్పిన సూపర్ సిక్స్‌లో మొదటి ఏడాదిలో ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. తాము పోరాటం చేయడంతోనే తల్లికి వందనం పథకం అమలు చేశారన్నారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని, అభివృద్ధి, సంక్షేమం పూర్తిగా విస్మరించారన్నారు. 2019–24 కాలంలో గతంలో ఎన్నడూ లేనంతగా జగనన్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని గుర్తు చేశారు. తాము మోసపోయామని, ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా జగనన్నకే ఓటు వేస్తామని ప్రజలు చెబుతున్నారన్నారు. 2029లో వైఎస్సార్ సీపీకి ప్రజలు పట్టం కట్టడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, కొండారెడ్డి, మహ్మద్ సాదిక్, ఆర్‌వీఎస్ఆర్, దేవదానం, జెట్టి నగేష్, మర్రి సుబ్బన్న, జాఫర్, మైసూరారెడ్డి, దాసరి సురేష్, గఫార్ తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

## విద్యా సంస్థలపై విచారణ జరపకపోతే దీక్షలు

**కడప ఎడ్యుకేషన్:** అనంతపురం జిల్లా వ్యాప్తంగా శ్రీచైతన్య విద్యా సంస్థలపై సమగ్ర విచారణ జరపాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. కడప నగరంలోని పాఠశాల విద్య ఆర్జేడీ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు వారాల నుంచి అనంతపురం జిల్లా వ్యాప్తంగా పాఠశాలల సమస్యలపై ఆందోళన నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. శ్రీచైతన్య విద్యా సంస్థల్లో కనీస మౌలిక వసతులు కల్పించకుండా తల్లిదండ్రుల వద్ద వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. అంతేకాకుండా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బెల్టు, బూట్ల పేరుతో తల్లిదండ్రుల వద్ద ముక్కుపిండి రూ.30 వేల వరకు వసూలు చేశారని ఆరోపించారు. పాఠశాలలకు అనుమతులు ఒక చోట.. ఉంటే మరోచోట పాఠశాల నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. విద్యార్థులకు గాలి అందని రూములకు పరిమితం చేసి మానసికంగా కుంగదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్‌జేడీ శ్యాముల్‌కు ఆర్ఎస్‌యూ నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో గురు, ప్రమోద్, కిరణ్, ప్రసాద్, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు


ధర్నా చేస్తున్న నాయకులు

## పశు షెడ్ల నిర్మాణం..నాణ్యతలో రాజీ పడవద్దు

**కమలాపురం :** పశువుల షెడ్ల నిర్మాణ నాణ్యతలో రాజీ పడవద్దని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ ఆదిశేషారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పాచికలపాడులో రైతు సుదర్శన్ రెడ్డి నిర్మించిన పశువుల షెడ్‌తో పాటు పాచికలపాడు, సి.గోపులాపురం గ్రామాల్లో పశువుల దాహార్తి కోసం నిర్మించిన నీటి తొట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి రైతు పశువుల షెడ్లు నిర్మించుకోవచ్చన్నారు. షెడ్లు కావలసిన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇప్పటికే షెడ్లు నిర్మించుకున్న రైతుల బిల్లులు పెండింగ్‌లో లేకుండా అప్‌లోడ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే షెడ్ల నిర్మాణంలో నాణ్యతలో రాజీ పడవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గౌస్ బాషా, ఏపీఓ పార్థ సారధి, జేఈ ఉపేంద్ర, రైతులు పాల్గొన్నారు.


నీటి తొట్టెను పరిశీలిస్తున్న పీడీ ఆదిశేషారెడ్డి

## పథకాల అమలులో కూటమి ప్రభుత్వం వైఫల్యం

**వీరపునాయునిపల్లె :** కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో పూర్తిగా వైఫల్యం చెందిందని మండల కన్వీనర్ కల్లూరు రఘునాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని పార్టీ కార్యకర్తలతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం అయినా రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. సీనియర్ నాయకుడు రాజుపాలెం వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటి నుంచి జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడమే తప్ప వారికి వేరొక పనిలేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయని విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్ రెడ్డి, ఎంపీటీసీలు వెంకటరామిరెడ్డి, రాఘవయాదవ్, సర్పంచులు నరేష్‌రెడ్డి, వెంకటరెడ్డి, శేఖర్‌రెడ్డి, సంగమేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ శివాంజనేయరెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, గంగిరెడ్డి, సాంబశివారెడ్డి, గంగయ్య, బ్రహ్మానందరెడ్డి, వీరయ్య యాదవ్, ప్రతాప్‌యాదవ్ పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న వేదపండితులు

**బద్వేలు అర్బన్ :** స్థానిక సిద్దవటంరోడ్డులోని ఫైర్ ఆఫీసు వెనుకభాగంలో ఉన్న శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి, అభయాంజనేయస్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఆరు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనము, యాగశాల ప్రవేశం, అంకురార్పణం, గరుడపట ఆదివాసం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ, సెక్రటరీ అంకయ్య, ప్రధాన అర్చకులు వీరేశాచార్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాల వితరణ

**కాశినాయన :** మండలంలోని మూలపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పోరుమామిళ్ల మండలం కమ్మువారిపల్లె గ్రామానికి చెందిన పసుపులేటి వెంకటమ్మ సేవా సంస్థ నిర్వాహకుడు జీవీ రమణ బుధవారం పాఠశాలలో చదువుతున్న 28 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే మంచి నడవడిక కలిగి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం అదే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి రాజుపాళెం బాదుల్లా విద్యార్థులకు పలకలు, బలపాలు, పెన్సిళ్లు వితరణగా అందించారు. వారికి పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సుహాసిని, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## లోక కల్యాణార్థం పాదయాత్ర

**గోపవరం :** మండలంలోని వల్లెలవారిపల్లె శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం నుంచి పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పెనుశిల నరసింహస్వామి (పెంచలకోన) వరకు లోక కల్యాణార్థం నిర్వహించిన పాదయాత్ర దిగ్విజయంగా జరిగిందని ఆలయ ప్రధాన అర్చకులు పెంచలయ్య స్వామి అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి రెండు రోజుల పాటు దాదాపు 80 కి.మీ. మేర సాగిన పాదయాత్రలో దారి పొడవునా నరసింహస్వామి భక్తులు పలకరిస్తూ పాదయాత్రకు పూర్తి సంఘీభావాన్ని తెలిపారన్నారు. మొట్టమొదటి సారిగా నిర్వహించిన ఈ పాదయాత్రలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనడం హర్షణీయమన్నారు.

## పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

**ప్రొద్దుటూరు కల్చరల్ :** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీ, సీజీఎల్ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి సునీత తెలిపారు. స్థానిక జేవీవీ కార్యాలయంలో బుధవారం పోటీ పరీక్షల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సివిల్ సర్వీసెస్ ఫ్యాకల్టీ రవిశంకర్ మాట్లాడుతూ ఎస్ఎస్‌సీ సీజీఎల్ 14,582 పోస్టులు పడ్డాయని, వాటితోపాటు ఏపీ హైకోర్టు 1,621 పోస్టులు, బ్యాంక్ ఆఫ్ బరోడా 500 పోస్టులు, ఆర్ఆర్‌బీ గ్రూప్ డీ 32,438 పోస్టులు, ఏఎల్‌పీ 11,558 పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ఈ ఉద్యోగాలకు కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన టీచింగ్ ఫ్యాకల్టీతో రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కోచింగ్ ఉంటుందన్నారు. కోచింగ్‌కు రాదలచిన వారు 9705333305 ఫోన్ చేసి రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రవిబాబు, నరేష్, దేవానంద్, మౌనిక, గాయత్రి, హైమావతి, భువన్, హరికేశన్, నరసింహులు పాల్గొన్నారు.

## సమాజంలో దళితులపై చిన్నచూపు తగదు

**కడప వైఎస్ఆర్ సర్కిల్:** సమాజంలో దళితులను చిన్నచూపు చూడడం తగదని రాయలసీమ మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి తస్లీమ్ అన్నారు. దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో కడప ఆర్డీవో కార్యాలయం ఎదుట మూడోరోజు రిలే దీక్షలను ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తస్లీమ్ మాట్లాడుతూ, స్వతంత్ర భారత దేశంలో దళితులు, మహిళలకు నిజమైన స్వాతంత్రం రాలేదన్నారు. పెత్తందారుల ఉక్కు పాదాల కింద దళితులు నలిగిపోతున్నా ప్రభుత్వాలు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. దళితులకు అన్యాయం చేస్తే చట్టం వారిని కఠినంగా శిక్షిస్తుందనే భయం ఏమాత్రం లేదని తెలిపారు. పాత కడప దళిత రైతుల భూమిని లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకునిని దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటేష్, మడగలం ప్రసాద్, రాయలసీమ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ప్రతాపరెడ్డి, చిన్న సుబ్బయ్య, చాంద్ బేగం, శోభారాణి పాల్గొన్నారు.


రిలే నిరాహార దీక్షలను ప్రారంభిస్తున్న తస్లీమ్

## ఎనిమిది గంటల పని విధానం మాకు వద్దు

**కడప వైఎస్ఆర్ సర్కిల్:** రాష్ట్ర కేబినెట్ నిర్ణయించిన ప్రకారం ఎనిమిది గంటల పని విధానం మాకు వద్దు అని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి అన్నారు. నగరంలోని హోచిమిన్ భవన్‌లో బుధవారం ఏఐటీయూసీ నగర ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ నిర్బంధ ఓవర్ డ్యూటీ చేయించడం మానుకోవాలని, భద్రత లేని రోజుల్లో శ్రామిక మహిళలను రాత్రిళ్లు పనిచేయించడం తగదన్నారు. ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. చంద్రబాబు ఆలోచనలను పెట్టుబడిదారులు అమలు చేస్తున్నప్పుడు, కార్మికుల పని గంటలు పెంచాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ఆయన ప్రశ్నించారు. తక్షణమే పెంచిన పని గంటల నిర్ణయం ఉపసంహరించుకోకపోతే కార్మికుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇంటి పన్ను, విద్యుత్తు చార్జీలు, పెట్రోల్, నిత్యావసర ధరలు పెంచిన ప్రభుత్వం కార్మికుల వేతనాలు మాత్రం పెంచకపోతే ఎలా బ్రతుకుతారని ప్రశ్నించారు. మొదట్లో వారానికి ఐదు రోజుల పనితో మొదలుపెట్టి, పని చేసిన రోజులకే వేతనం చెల్లించేలా వెన్నుపోటు పొడుస్తారన్నారు. కార్మికవర్గంపై జరుగుతున్న దాడిని వ్యతిరేకిస్తూ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జులై 9 జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని డిమాండ్లు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జి.వేణుగోపాల్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి.బాదుల్లా, నగర కార్యదర్శి మద్దిలేటి, నరసింహులు, తారకరామారావు ఈశ్వరయ్య, జాన్, వెంకటాద్రి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

## అన్నదాత సుఖీభవ నిధులను అందజేయాలి

**కడప వైఎస్ఆర్ సర్కిల్:** జిల్లాలో పట్టా, డీకేటీ, కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ నిధులను అందజేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. నగరంలోని ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి హాల్‌లో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు 2014–19 మధ్యకాలంలో రూ.1,50,000 రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున 90శాతం రాయితీతో పచ్చి రొట్ట విత్తనం, వడ్లతోపాటు సాగుకు అవసరమైన పంట విత్తనం అందజేయాలని కోరారు. కేసీ, మైలవరం ప్రాజెక్టు పరిధిలోని కాల్వలు శుభ్రపరిచి చివరి ఆయకట్టుకు నీరు చేరే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. తెలుగుగంగ, సర్వరాయసాగర్, వామికొండ ప్రాజెక్టులలో నీరు ఉన్నప్పటికీ పంటలకు నీరందడం లేదని, ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన కాల్వల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 23న కలెక్టరేట్ ఎదుట ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగే ధర్నాలో రైతులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవి.సుబ్బారెడ్డి, పోతిరెడ్డిభాస్కర్, జిల్లా ఉపాధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి, కట్టయానాదయ్య, జిల్లా సహాయ కార్యదర్శులు ఈ.బాలచంద్రయ్య, పి.చంద్రశేఖర్ రెడ్డి, బి.రామాంజనేయులురెడ్డి, భద్రయ్య, పక్కీరప్ప, ఎన్.జనార్దన్‌రెడి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

**కడప ఎడ్యుకేషన్:** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని 21వ వార్డు నగరపాలక మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎస్.సులోచనరాణి అన్నారు. కడప నగర శివారులోని రాజీవ్ గృహ కల్పలో(21వవార్డు) ఉపాధ్యాయులు ఇంటింటా తిరిగి విద్య యొక్క ఆవశ్యకతను స్థానికులకు వివరించారు. బీహార్, పశ్చిమ బెంగాల్ ప్రాంతాల నుంచి వచ్చి ఫ్యాక్టరీలో పని చేస్తున్న ఉద్యోగులు, కూలీలు బడి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపాలని కోరారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, బ్యాగు, యూనిఫామ్, బెల్ట్, షూ, సాక్సులు, మధ్యాహ్నం పౌష్టికాహారం ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని అవగాహన కల్పించారు. తల్లికి వందనం పేరుతో ప్రభుత్వం రూ.15 వేలు జమ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్వీ.ప్రసాద్‌రెడ్డి, లక్ష్మీనారాయణమ్మ, జె.ఆనంద్‌కుమార్, టి.సత్యనారాయణ, సల్మాఖానం, విజయ్, తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

## ఉపాధ్యాయుల బదిలీల నిర్వహణ భేష్!


డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను సన్మానిస్తున్న ఫ్యాప్టో నాయకులు

**కడప ఎడ్యుకేషన్:** వైఎస్సార్ కడప జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ఇలాంటి సమస్యలు లేకుండా డీఈఓ షేక్ షంషుద్దీన్ బేషుగ్గా నిర్వహించారని ఫ్యాప్టో జిల్లా నాయకులు కొనియాడారు. ఈ విషయమై బుధవారం కడప జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఇలియాస్‌బాషా అధ్యక్షతన డీఈఓ షేక్ షంషుద్దీన్, కార్యాలయ సిబ్బందిని డీఈఓ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో చైర్మన్ ఇలియాస్‌బాషా, సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి అబ్దుల్లా, అనుబంధ సంఘాల నాయకులు మాట్లాడుతూ హెచ్ఎంల పదోన్నతులు, ఎస్ఏల పదోన్నతులు, బదిలీలు, ఎస్జీటీల మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహణలో జిల్లా యంత్రాంగం సమర్థంగా పనిచేసిందన్నారు. ఎప్పటికప్పుడు సామాన్య ఉపాధ్యాయుడికి అండగా ఉంటూ సమస్యలు పరిష్కరించడంలో చక్కటి కృషి చేశారని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రీ అపోర్షన్ వేకెన్సీలోకి బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతభత్యాలు ఆలస్యం కాకుండా త్వరగా పొజిషన్ ఐడీలను కేటాయించాలని కోరారు. అలాగే జూన్ నెల జీతాల విషయంలో నెలకొన్న సందిగ్ధత తొలగించే విధంగా డీడీఓలకు తగిన సూచనలివ్వాలని ఫ్యాప్టో సంఘాలు కోరాయి.

ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎన్.సంగమేశ్వర రెడ్డి(ఎస్‌టియు), మాధన విజయ్ కుమార్(యుటిఎఫ్), పి.ఖాదర్ బాషా,(ఏపీటీఎఫ్ 257), ఎంవి.సుబ్బారెడ్డి(ప్రధానోపాధ్యాయ సంఘం) ఎం.జుబేర్ అహ్మద్ (రూటా), ఎం.ప్రవీణ్‌కుమార్(ఎస్ ఏ పీ ఈ అసోసియేషన్), జ్యోతి రామచంద్ర బాబు (బి.టి.ఏ) ఎస్. నిహారిక (అప్టా), నాయకులు కే.సురేష్ బాబు, మహేష్ బాబు, శ్యామల దేవి, వివిధ సంఘాల నాయకులు వలి శివ, లక్ష్మిరెడ్డి, మనోహర్‌రెడ్డి, ఉపాధ్యాయుల తదితరులు పాల్గొన్నారు.

## నైతిక విలువలతో కూడిన విద్య అందించాలి

– కళాశాల ఆర్‌జేడీ నాగలింగారెడ్డి

**కడప ఎడ్యుకేషన్:** నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్య అందించాలని కళాశాల ఆర్‌జేడీ నాగలింగారెడ్డి పేర్కొన్నారు. కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంపై విద్యార్థులకు బుధవారం మోటివేషన్ స్పీచ్ అందించారు. కళాశాల అధ్యాపకులు తమ సొంత పిల్లల్లా భావించి విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్య అందించాలన్నారు. యోగా సాధన ద్వారా ఒత్తిడి, ఆందోళన, మానసిక రుగ్మతల వంటి సమస్యలను దూరం చేయవచ్చని, ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించి యోగాంధ్రను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దీంతోపాటు వారికి క్రమశిక్షణను అలవాటు చేయాలని సూచించారు. జూన్ 21న జరగబోయే యోగా డేని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపల్ సలీంబాషా, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కళాశాల ఆర్‌జేడీ నాగలింగారెడ్డి